# నీడబుడగ

రేపు మొదటి క్లాసులో చెప్పాల్సిన పాఠం గురించి మూడు నాలుగు పుస్తకాలు తిరగవేసేసరికి తొమ్మిదిన్నర దాటింది. పదిహేను పాయింట్లు వరకు కాయితం మీద రాసుకున్నాను. పుస్తకంలో ఉన్నది ఉన్నట్లు చెబితే ఆసక్తిగా ఎవరూ వినటంలేదు. నేను చెప్పేది పొలిటికల్ సైన్స్. ఎంతో తేలికయిన పాఠ్యాంశంలా అనిపించినా గందరగోళంగా ఉంటుంది. చాలామందికి ఆర్ట్స్ సబ్జక్ట్స్ అంటే మంచి అభిప్రాయం లేదు. భవిష్యత్తులో ఉపయోగం ఉండదని సైన్స్ సబ్జక్ట్సుకు ఎగబడుతుంటారు. పొలిటికల్ సైన్స్‌కు ఉండే విలువ ఇంతవరకు మొక్కపోలేదు. 'టీచింగ్ ఈజ్ బెస్ట్ వేటు లెర్న్ థింగ్స్' అని ఎక్కడో చదివిన గుర్తు. ప్రతి కొత్త పుస్తకం పట్టుకున్నప్పుడల్లా ఈ మాటే గుర్తు వస్తుంటుంది.

పెన్ను మూసి బల్ల మీద పెట్టాను. సాయంత్రం నుండి విరామం లేకుండా పుస్తకాల ముందు ఉండటం వలన కళ్లు మంటలుగా ఉన్నాయి. గదిలో లైటు చల్లటి గాలికి వణుకుతూ ఊగుతోంది. చివరంటా కాలిన సిగరెట్‌ను యాష్‌ట్రేలో కుక్కి కుర్చీకి చేరగిలబడ్డాను. ఒకసారి వళ్లు విరుచుకుని చేతులు జోడించాక భుజాల నొప్పి తగ్గినట్లనిపించింది.

ఈ సరికి రంజన్ విజయవాడ స్టేషన్‌లో ఉండి ఉంటాడు. సరిగ్గా పదిగంటలకు విజయవాడ నుండి బండి ఉంది. గుంటూరు చేరుకుని గదికి వచ్చేసరికి పదకొండున్నరా పన్నెండవుతుంది. ఈరోజు అతనితో గట్టిగా చెప్పేస్తాను. ఈ గదిలో ఉండటం నావల్ల కాదని. ప్రతిదానికీ దూరమే. రెండు ఫర్లాంగులు నడిస్తేకాని సిగరెట్ షాపు దొరకదు. షాపులో నాకు కావలసిన బ్రాండు దొరకదు. షాపు పక్కనే టీ కొట్టు ఉంది. అందులో టీ మటుకు చాలా బాగా ఉంటుంది. భోజనానికి మరికొంత దూరం వెళ్ళాలి. ఇంతదూరం ఒక ఎత్తు అయితే ఉండటం మరొక ఎత్తు అయింది. రంజన్ నాకు మంచి మిత్రుడు. పి.యు.సి. నుండి కలిసి చదువుకున్నాం. వాడి పోరు భరించలేక వారం కిందటే ఈ గదిలోకి మారాను.

నిజానికి అది గది కాదు. పెద్ద ఇల్లు. కోర్టు గొడవల్లో ఉంది. చాలా కాలం ఖాళీగా ఉంది. ఈ మధ్యనే గొడవల్లోంచి బయట పడినప్పటి నుండి రంజన్ అందులో

ఉంటున్నాడు. ఇల్లు విశాలంగా ఉంటుంది. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అద్దె లేదు. కాకపోతే నాకు దయ్యాల కొంపలా అనిపిస్తోంది. ఇక్కడకు రాక మునుపు దయ్యాల కథలు వినటానికి ఆసక్తికరంగా ఉన్నా దయ్యాలంటే నాకు బొత్తిగా నమ్మకం ఉండేది కాదు. తీరా చూశాక ఎలా కొట్టి పారేయటం? నేను చూసిన సంగతి రంజన్‌కు చెబితే కాకమ్మ కథలా కొట్టి పారేసి, "ఇంతకాలం నుండి నేనీ ఇంట్లో ఉంటోంటే మరి నాకెందుకు కనిపించలేదు?" అని ఎదురుప్రశ్న వేశాడు. అతను లాజిక్ లెక్చరరు. మాటల్లో దొరకడు.

* * *

మొన్న మధ్యాహ్నం ఏదో పనుండి రంజన్ విజయవాడ వెళ్లాడు. అతను వెళ్లాక గది బోసిపోయినట్లనిపించింది. అతనుంటే కబుర్లు చెప్పుకుంటూనో, చదరంగం ఆడుతూ కూర్చుంటే కాలం చకచక గడిచి పోతుండేది. బోర్ కొట్టేది కాదు. మా కాలేజి లైబ్రరీ నుండి పుస్తకాలు తెచ్చుకున్నాను కాని ఎంచాతనో చదవటం మొదలెట్టడం పడలేదు. త్వరగానే హోటలులో భోజనం చేసి వచ్చి ఆ రాత్రి పదింటికి ముందే లైటార్పేసి పడుకున్నాను. వెంటనే నిద్ర పట్టింది.

మధ్య రాత్రి దాటాక హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఒకసారి నిద్రపోతే తెల్లవారే వరకు నాకు మెలకువరాదు. అథవా వచ్చినా రెండు మూడు నిమిషాల్లో మళ్లీ నిద్రలోకి జారిపోతాను. ఈ సారి వెంటనే నిద్రపట్టలేదు. లేచి కూర్చున్నాను. మా ఇంటి ఎదురుగా కుక్క ఏడుస్తోంది. కిటికీలు తెరచి ఉన్నా గదిలో గాలి లేదు. బిగుసుకు పోయినట్లుంది. గదిలో లైటు వెలుగుతోంది. నిద్రపోయే ముందు లైటు ఆర్పి పడుకున్నట్టు నాకు బాగా గుర్తుంది. దాన్ని తిరిగి ఎవరు వెలిగించారు? లేకపోతే నేను ఆర్పకుండా పడుకున్నానా? లైటు ఉంటే నాకు నిద్ర పట్టదు. దిండు పక్కనే ఉన్న సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె అందుకుని సిగరెట్ తీసి వెలిగించాను. కుక్క ఏడుపు ఆగిపోయింది. బల్ల మీదున్న అలారం గడియారం ఆగిపోయింది. దాన్ని నిన్నే బాగు చేయించాను. బల్ల సొరుగు లోంచి చేతి గడియారం తీసి చూశాను. పదకొండూ యాభయి అయింది. లైటు ఆర్పి మంచం మీద పడుకొన్నాను. సిగరెట్ కిటికీలోంచి బైటకు విసిరి దుప్పటి కప్పుకోబోతోంటే వరండాలో ఎవరో స్త్రీ ఏడుస్తున్న శబ్దం వినిపించింది. నేను పొరబడటం లేదు. కావాలని ఈ పనులు ఎవరయినా చేసి నన్ను భయపెట్టదలచుకుంటున్నారా? లేచి కూర్చున్నాను. మంచం దిగి తలుపు తెరిచి వరండా వైపు వెళ్దామనిపించింది కాని నన్ను ఎవరో మంచానికి కట్టి వేసినట్లు లేవలేకపోయాను. లేక లేచి బయటకు వెళ్లటానికి భయపడ్డానా? నాకేమీ అర్థం కావటం లేదు. అలారం అందుకుని కీ ఇద్దామనుకునేంతలో గడియారం లోని ముళ్లు కదలటం మొదలెట్టాయి. బయట ఏడుస్తున్న చప్పుడు ఆగిపోయింది. ఆ తర్వాత నాకు ఎటువంటి చప్పుడు వినిపించలేదు. కొద్దిసేపు చూసి లైటార్పి నిద్రపోయాను. వెంటనే నిద్ర పట్టింది.

నిన్న రాత్రి ఎనిమిదింటికే భోజనం చేసి పడకమీద చేరాను. అంతకు ముందటి రాత్రి నిద్రలేక పోవటం వలన వెంటనే నిద్ర పట్టింది. అర్ధరాత్రప్పుడు ఎవరో తట్టి లేపినట్లు మెలకువ వచ్చింది. టేబుల్‌లైటు వెలుగు బల్లమీద గుండ్రంగా పరుచుకుని ఉంది. అలారంలో ముళ్లు తిరుగుతున్నాయి. రంజన్ వచ్చి ఉంటాడనిపించింది. మంచం వైపు చూశాను. మంచం ఖాళీగా ఉంది. కాని మంచం పక్కగా ఉన్న కుర్చీలో ... ఉలిక్కిపడి మళ్లీ చూసాను... ఎవరో కూర్చుని ఉన్నారు. ఆ వ్యక్తి వీపు మటుకు నాకు కనబడుతోంది. జుట్టు బాగా పెరిగి ఉంది. తలుపు వంక చూశాను. మూసి గడి పెట్టబడి ఉంది. ఎవరతను? లోపలకి ఎలా రాగలిగాడు? భయంతో లేచి కూర్చున్నాను. ఎవరో నా గొంతు నొక్కి పట్టినట్లు నోరు పెగిలి మాటలు బయటకు రావటం లేదు. వెన్నులో బయల్దేరిన వణుకు శరీరమంతా పాకింది. మంచం దిగేంత శక్తి రావటం లేదు. ఏమి చేయాలో వెంటనే అర్థం కాలేదు. ఆనకట్ట వేసినట్లు ఆలోచనలు ఆగిపోయాయి. చివరకు ధైర్యం కూడగట్టుకుని, “ఎవరూ?” అడిగాను. నా కంఠస్వరం నాకే కొత్తగా వినిపించింది. గట్టిగానే అడిగినా బలంగా ఉన్నట్లనిపించలేదు.

కుర్చీలో ఉన్న వ్యక్తి కదిలాడు. కాని నా ప్రశ్నకు జవాబు ఇవ్వలేదు. అరనిమిషం ఆగి, “ఎవరని అడగితే మాట్లాడవేం?” అడిగాను, ధైర్యాన్ని పుంజుకుంటూ. ఆ వ్యక్తి కుడిచేయి పైకి లేచింది. పాలిపోయినట్లు చేయి తెల్లగా ఉంది. మణికట్టుకు గాయం తగిలిందేమో బేండేజి వేసి ఉంది. తెల్లటి బేండేజి మీద రూపాయి బిళ్లంత రక్తపు మరక స్పష్టంగా కనిపిస్తోంది. ఆ వ్యక్తి మాట్లాడలేదు కాని ‘అరవకు’ అన్నట్టు చేయి గాలిలో ఊపి దించేశాడు. అరనిమిషం తర్వాత నాకు ఎవరూ కనిపించలేదు. కుర్చీ ఖాళీగా ఉంది. వేసిన తలుపు వేసినట్టే ఉంది. మొన్న రాత్రి సంఘటన భ్రమ అనుకుంటే నిన్న రాత్రి జరిగింది భ్రమ ఎంతమాత్రం కాదు. కలకాదు. నేను మెలకువగానే ఉన్నాను. ఇన్నిరోజుల నుండి ఇక్కడ ఒంటరిగా ఉంటున్న రంజన్‌కు ఇటువంటి సంఘటనలు ఎదురు కాలేదా? ఈ రాత్రికి ఏమి జరగబోతుందో?

* * *

సమయం తొమ్మిదీ నలభయి అయింది. రంజన్ గదికి చేరుకోవటానికి కనీసం రెండు గంటలు పడుతుంది. అతను ఉంటే ఇటువంటి సంఘటనలు జరుగుతాయని నేను అనుకోవటం లేదు. అతనికి ఈ సంగతులు చెప్పినా నమ్మడు. ప్రతి మనిషిలోనూ అంతర్గతంగా భయం ఉంటుంది. చాలామందిలో బయట పడదు. ఎప్పుడో, ఏకాంత ప్రదేశంలో ఒంటరిగా ఉన్నప్పుడు కొద్దికొద్దిగా బయటకు వస్తుంది. ఇది మానసిక మయిన అనారోగ్యంగా మారే అవకాశం లేకపోలేదు అంటూ లెక్చర్ మొదలు పెడ్తాడు.

ఆరునూరయినా నూరు ఆరయినా రేపు పెట్టె, బేడా సర్దుకుని ఖాళీ చేయదల్చుకున్నాను. నేను వదిలిపెట్టివచ్చిన గది ఇంకా అలానే ఉంది. ఎవరూ రాలేదు. ఇల్లు గలాయనతో ఇవేళ మాట్లాడాను కూడా. రంజన్ కోసమే నేను ఎదురు చూస్తుంట.

బల్లమీదున్న పుస్తకాలు సర్ది రేక్‌లో పెట్టి గుడ్డలు మార్చుకుని తలుపుకు తాళం వేసి బయటకు వచ్చాను. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. డిసెంబరు చలి చిక్కగా కురుస్తోంది. తలకు మఫ్లరు చుట్టుకుని సిగరెట్ తీసి వెలిగించాను. సెంటరు వరకూ వచ్చి వేడివేడి టీలు ఒకదాని తర్వాత ఒకటి తాగి ఏ పేజికి ఆ పేజీగా ఊడి పోయిన దినపత్రికను చదువుతూ రిక్షావాళ్ల మాటలు వింటూ గంటసేపు కాకా హోటల్లో కూర్చుని తిరిగి వస్తూ సిగరెట్ పేకెట్ కొనుక్కుని మెల్లగా నడుచుకుంటూ గది చేరుకున్నాను. గదిలో బయటంత చలి లేదు. వెచ్చగా ఉంది. గుడ్డలు మార్చుకోలేదు. తలుపు గడి వేసి మంచం మీద పడుకున్నాను. వెంటనే నిద్ర పట్టింది.

తిరిగి మెలకువ వచ్చేసరికి పన్నెండూ పది అయింది. నిద్రపోయేముందు లైటు ఆర్పేసినా టేబుల్ లైటు వెలుగుతోంది. రంజన్ వచ్చి ఉంటాడా అనకుంటూ అతను పడుకునే మంచం వైపు చూశాను. మంచం ఖాళీగా లేదు. ముఖం నిండా దుప్పటి కప్పుకుని పడుకుని ఉన్నాడు. రంజన్ వచ్చిఉంటాడు. తలుపు తట్టి ఉంటే నిద్రలో నేను గడి తీసి ఉంటాను. అలిసి పోయి ఉండటం వలన మళ్లీ వెంటనే నిద్రపోయి ఉంటాను. నా నిద్ర చెడగొట్టడం ఇష్టంలేక మాట్లాడి ఉండకపోవచ్చు.

చలికి నిద్రపట్టటం లేదేమో రంజన్ కదులుతున్నాడు.

"రంజన్, రంజన్" పిలిచాను.

పలకలేదు కాని కదలిక ఆగిపోయింది.

నిద్రపోతున్న అతన్ని లేపటం ఇష్టమనిపించలేదు. దుప్పటి కప్పుకుని గోడవైపుకు తిరిగి నిద్రకుపక్రమించేంతలో తలుపు తట్టిన చప్పుడయింది. దుప్పటి పక్కన పెట్టి లేచి కూర్చున్నాను. మళ్లీ చప్పుడు వినిపించింది. "ఎవరూ?" పెద్దగానే అడిగాను. రంజన్ నిద్రలోంచి లేచినిజం తెలుసుకోవాలి. నేను భ్రమకు లోను కావటంలేదని అతనికి అర్థం కావాలి.

"పుల్లారావ్. నేనురా. తలుపు తీయి" బయట నుండి రంజన్ గొంతు స్పష్టంగా వినిపించింది. మరి రంజన్ మంచం మీద నిండా ముసుగు కప్పుకుని పడుకున్నది ఎవరు...?

*(ఒక ఆంగ్ల కథ చదివిన తర్వాత)*

◆ కృష్ణా పత్రిక, వారపత్రిక, 17 ఫిబ్రవరి 1968